క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్

హిందూపురం: చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గతంలో ఆయన ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.45 వేలు మంజూరయ్యాయి. ఈ సాయాన్ని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ అందజేశారు. సీఎం జగన్, నవీన్ నిశ్చల్‌కు జయచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

18న మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహానాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పాఠశాలలో జెండా ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

లేపాక్షి: మండలంలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. పలువురు విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి, సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, వసంత్, జగదీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌బాబు

పెనుకొండ: క్రీడలతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం యూటీఎఫ్ నాయకుడు రామాంజినేయులు పేరుతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకుందన్నారు. ఒత్తిడిని దూరం చేయడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. మొదటి రోజు చిలమత్తూరు వర్సెస్ రొళ్ల, ధర్మవరం వర్సెస్ గుడిబండ మధ్య పోటీలు జరిగాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవీంద్ర, శివ, శేషాద్రి, నాగార్జునరెడ్డి, ఉపేంద్ర ఆదిజినేస్, శ్రీనివాస్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



ఆపరేషన్ చేయించుకున్న వారికి కళ్లద్దాలు, మందులు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: శరీర భాగాల్లో ప్రధానమైన కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని, కంటి సమస్యలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని డాక్టర్ అన్యూహ్యా అన్నారు. శనివారం స్థానిక సీఅండ్ ఐజీ మిషన్ చర్చి కాంపౌడ్‌లో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా ఉచిత కంటి ఆపరేషన్ల నిర్వాహణ, పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 650 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 230 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించి, తిరిగి హిందూపురానికి తీసుకురావడం జరుగుతుందన్నారు. అలాగే గత నెలలో ఆపరేషన్ పూర్తి చేయించుకున్న 175 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఅండ్ఐ కాంపౌండ్ చర్చి కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి పాల్, డికెన్ బోర్డు సభ్యులు వాలంటీర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా ‘కీర’ సాగు

- ఎకరాకు రూ.1.5 లక్షల వరకూ లాభం
- 90 రోజులకే పంట చేతికి
- నియోజకవర్గ వ్యాప్తంగా 380 హెక్టార్లలో సాగు

రొళ్ల: నియోజకవర్గంలోని రైతులు వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వేరుశనగ పంట సాగు చేసిన వరుసగా నష్టపోయారు. ఈ తరుణంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపి అధిక లాభాలు లార్జిస్తున్నారు. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో బోరు బావుల్లో నీటి వసతి కలిగిన రైతులు కీరకాయల (దోసకాయలు) పంట సాగు చేశారు. తక్కువ కాల వ్యవధిలోనే అధిక లాభాలు పొందుతున్నారు. వాతావరణం అటు అధిక ఉష్ణోగ్రత, అధిక పొడిగాను లేకుండా సమతూల్యంగా అనుకూలంగా ఉండటంతో ఎక్కువ శాతం మడకశిర నియోజకవర్గంలోనే ఈ పంటను రైతులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం, హిందూపురం నియోజకవర్గాల్లో కూడా ఇప్పుడిప్పుడు సాగు చేయడానికి రైతులు ముందుకొస్తున్నారు. రొళ్ల మండల కేంద్రంలో మురారి, గుడ్‌గ్రీన్స్, కృషి ఆగ్రోటెక్. ఇండోస్పానిస్ వంటి వివిధ కంపెనీలకు చెందిన కీర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

సాగు విధానం..

ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 380 హెక్టార్లలో రైతులు కీర సాగులో ఉంది. ఎకరాకు 10 వేల విత్తనాలు చొప్పున మూడు అడుగుల వెడల్పు, ఎనిమిది ఇంచుల పొడవు ప్రకారం విత్తనాలు పొలంలో నాటుకోవాలి. విత్తనాలు నాటిన 15 రోజులకు పంట మధ్యలో 10 అడుగుల దూరంలో కట్టెలను ఏర్పాటు చేసుకోవాలి. ఆ కట్టెపై భాగాన తీగకు కింది నుంచి కీరకాయ చెట్టుకు దారం సహాయంతో కట్టాల్సి ఉంటుంది. విత్తనాలు, ఎరువులు, మందులు, స్టేకింగ్ మెటీరియల్స్, స్ప్రేయర్స్, టార్చ్‌లైట్ తదితర వాటిని కంపెనీ వారు ముందుగానే రైతులకు అందిస్తారు. విత్తనాలు నాటిన 35 రోజులకు కోతలు మొదలవుతాయి. రెండు నెలల పాటు కీరకాయలు నిరంతరంగా వస్తుంటాయి.



టీడీ పల్లి గ్రామం వద్ద సాగు చేసిన కీర

కాయల నాణ్యతను బట్టి రేటు..

రోజూ ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకూ కాయలు కోతకు వస్తాయి. కీర కాయల నాణ్యతను బట్టి ధరలు ఉంటాయి. మొదటి గ్రేడ్ రకం రూ.38, రెండవ గ్రేడ్ రకం రూ.24, మూడు, నాల్గవ గ్రేడ్ రకం రూ.13, ఐదవ గ్రేడ్ రకం రూ.3 చొప్పున కేజీ కీరకాయలకు కంపెనీ వారు బిల్లు చెల్లిస్తారు. ఆఖరి బిల్లులో ఇచ్చిన ఎరువులు, విత్తనాలు, మందులు తదితర వాటికి సంబంధించి బిల్లును జమ చేసుకుని మిగిలిన మొత్తాన్ని రైతు ఖాతాలో జమ చేస్తారు. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.ఒకటిన్నర లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు ఆదాయం పొందుతున్నామని రైతులు సంతోషంగా చెబుతున్నారు.

ఉపాధి లభిస్తోంది



రైతులు ఎక్కువ శాతం బోరుబావుల కింద కీర పంటను సాగు చేస్తున్నారు. దీంతో స్థానికంగా కూలీలకు ఉపాధి లభిస్తోంది. ఉన్న గ్రామంలోనే ఉపాధి లభించడం వల్ల కుటుంబ పోషణ భారంగా అనిపించడం లేదు. సంవత్సరంలో రెండు సార్లు సాగు చేయడం వల్ల ఆరు నెలల పాటు ఉపాధి దొరుకుతోంది.

– రేణుకమ్మ, కూలీ, టీడీ పల్లి

పంట ఆశాజనకంగా ఉంది



ఏటా వేరుశనగ సాగుచేసి నష్టపోయాం. గత రెండేళ్లుగా కీర పంటను సాగు చేస్తున్నా. ఈ ఏడాది 0.75 సెంట్ల విస్తీర్ణంలో కీర సాగు చేశాను. ఖర్చులన్నీ పోనూ రూ.50 వేలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఈ పంటకు ఎక్కువగా బ్యాక్టీరియా సోకే ప్రమాదం ఉన్నందున ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. అలాగే ఎకరా విస్తీర్ణంలో పత్తి పంటను కూడా సాగు చేశాను.

– నాగభూషణ, టీడీ పల్లి

ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి..

రోజు చుట్టు పక్కల గ్రామాల్లో సాగు చేసిన కీరకాయలను రైతుల ఎదురుగానే తూకం వేసి రొళ్లలో ఉన్న కంపెనీ బ్రాంచీలకు తరలిస్తారు. అక్కడి నుంచి తమిళనాడు, రాణిబెన్నూర్, కుణిగల్, కొట్టూరు వంటి పట్టణాల్లో ఉన్న ఫ్యాక్టరీలకు తరలించడం జరుగుతుంది. ఫ్యాక్టరీలో పొష్టికాహారం, ఊరగాయలు తయారు చేసి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనా, సింగపూర్, మలేషియా, ఇంగ్లాడ్, న్యూయార్క్, ఆస్ట్రేలియా వంటి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఏడాదికి ఏప్రిల్, డిసెంబర్ నెలలో మాత్రమే రెండు సార్లు కీర పంటను సాగు చేసుకోవచ్చునని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు.

పుస్తకాలపై ధ్యాస పెట్టాలి



ఉత్తమ పాఠకుడిని సన్మానిస్తున్న అధికారులు

పావగడ: మొబైళ్ల వాడకాన్ని తగ్గించి, పుస్తకాలపై ధ్యాస పెట్టాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక కేంద్ర గ్రంథాలయంలో శనివారం గ్రంథ పాలకుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడూ తల వంచుకుని మొబైళ్లను చూస్తూ ఉంటే జీవితంలో తలెత్తుకోలేరన్నారు. అదే తల వంచుకుని పుస్తకాలను చదివితే మంచి ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. అనంతరం నిత్యం గ్రంథాలయంలో పుస్తకాలను చదివే కేశవ చంద్రదాస్‌కు ఉత్తమ పాఠకుడు ప్రశస్తి అందించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టీకే బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని అలవర్చుకోండి



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకుని, భరతమాత రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మేరా మట్టి–మేరా దేశ్ అభియాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇళ్ల ముందు కనీసం రెండు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ వరదరాజు మాట్లాడుతూ.. అమృత మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వెంకటేశ్ 75 మొక్కలు నాటడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో శంకరరెడ్డి, బత్తినేని నాని, రాజేశ్, టెంకాయల రవి, మైలప్ప, రిజ్వాన్, బాల సుబ్రహ్మణ్యం, హెచ్ఎం ధనుంజయ, ప్రిన్సిపాల్ బసవ లింగప్ప పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు మేలు

అగళి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందుతున్నాయా.. లేదా అని తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొమరేపల్లి పంచాయతీలోని కదిరేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరారు. బీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విన్నవించారు. సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం, కదిరేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు పచ్చచొక్కాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. బియ్యం కార్డులు, పింఛన్ అందాలంటే జన్మభూమి కమిటీలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, కోమరేపల్లి సర్పంచ్ సుజాతమ్మ, సర్పంచులు బసవరాజు, శివకుమార్, రామకృష్ణప్ప, రావుడి ఎంపీటీసీ నింగమ్మ, జేసీఎస్ కన్వీనర్ శివన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రప్ప, కామరాజు, బసవరాజు, రామ్మన్న, లింగరాజు, రాజశేఖర్, నాటరాజు, సతీష్, మధు, రామలింగప్ప, శివరాజు, నాగేంద్ర, సదానంద ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి

మడకశిర: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 25న మడకశిరలో పర్యటిస్తారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమై మంత్రి పర్యటనపై చర్చించారు. అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పట్టణంలోని వైబీ హళ్లి క్రాస్‌లో మాజీ ఎమ్మెల్యే వైసీ తిమ్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజ గౌడ్, మాజీ ఎంపీపీ బజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లిలో స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి ఇంటి ముందు స్థలంలో అపరిశుభ్రత నెలకొనడంతో వాగ్వాదం జరిగింది. గ్రామానికి చెందిన రాజునాయక్‌పై అదే గ్రామానికి చెందిన రామాంజినాయక్, శారదాబాయి, రవినాయక్, కృష్ణానాయక్ దాడి చేశారు. ఈ ఘటనలో రాజునాయక్ తలకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామంలో అరుణ్ నాయక్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇంట్లోనే పురుగుల మందు సేవించాడు. గమనించిన తండ్రి బాలక్రిష్ణ నాయక్ గ్రామస్తుల సహాయంతో అతడ్ని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

హిందూపురం అర్బన్: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా అవుతున్నట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందడంతో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. పట్టణంలోని లక్ష్మీపురం వద్ద మద్యం తరలిస్తున్న బెలోనా కారు (ఏపీ39–ఎండబ్ల్యూ 0940)ను తనిఖీ చేయగా.. 15 బాక్సులు (1440) టెట్రా ప్యాకెట్లు పట్టుబడినట్లు సీఐ స్వర్ణలత తెలిపారు. నగేష్‌ను అరెస్టు చేసి, మద్యం తరలిస్తున్న కారును సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయ వద్ద ఉన్న గుడ్డం కోనేరుకు నీటి సౌకర్యం కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి గుడ్డం కోనేరు పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. నీటి నిల్వ, కోనేరు వద్ద భద్రత, బారికేట్లు లైటింగ్ ఇతర సదుపాయలపై చర్చించారు. విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి మల్లికాబాను, ఏఈ నాగేంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొనడంతో కార్మికుడికి గాయాలు



గాయపడిన మూర్తి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికుడు మూర్తిని ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. పంచాయతీ కార్యాలయ సమీపంలో పారిశుధ్య కార్మికుడు మూర్తి చెత్తను ట్రాక్టర్‌లో ఎత్తివేస్తున్నాడు. డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడంతో వెనుక భాగంలో ఉన్న మూర్తి పై నుంచి ట్రాక్టర్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో మూర్తి నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు తరలించారు. సర్పంచ్ గంగాదేవి, ఉప సర్పంచ్ వేణు, కార్యదర్శి నాగముణి తదితరులు కార్మికుడిని పరామర్శించారు.

వంద ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో ఇప్పటి వరకూ 100 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటించామని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పర్యటించి పండ్ల మొక్కలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు సలహాలు అందిస్తున్నామని తెలిపారు. పండ్ల మొక్కల పెంపకంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. మామిడి, జామ, కొబ్బరి, అల్ల నేరేడు, సీతాఫలం, చింత, డ్రాగన్‌ఫ్రూట్ తదితర మొక్కలను రైతులు ఈ పథకం ద్వారా నాటుకోవచ్చని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 186 ఎకరాల్లో 90 మంది రైతుల పొలాల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 100 ఎకరాల్లో మొక్కలను నాటించామని, మిగిలిన 86 ఎకరాల్లో మొక్కల పెంపకం చేపట్టేలా చర్యలు చేపడుతామన్నారు. రైతులు సాగు చేసిన మొక్కలను సంరక్షించుకోవడానికి ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు బిల్లులు చెల్లింస్తుందన్నారు.

యువకుడిపై దాడి

పెనుకొండ రూరల్: తన కుమారుడు మురళిపై గుజరీ వ్యాపారులు దాడి చేసినట్లు నగర పంచాయితీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మురళి చెరువులో సరదాగా ఫోటోలు దిగడానికి వెళ్లడంతో సమీపంలోని గుజరీ వ్యాపారస్తులు దాడి చేశారని తెలిపాడు.

నేడు దివ్య వస్తువుల ప్రదర్శన

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య దర్గా వద్ద మహమ్మద్ ప్రవక్త, వారి మనవలు హసేన్, హుసేన్‌కు చెందిన దివ్య వస్తువులను ఆదివారం ప్రదర్శించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి కేశాలు, దుస్తులు, రుద్రాక్షలు, తలపాగా ఇతర 40 రకాల వస్తువులను ప్రదర్శనలో ఉంచనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దర్గా పీఠాధిపతి పర్యవేక్షించారు.

శనీశ్వర స్వామికి పూజలు



అలంకరణలో శనీశ్వర స్వామి

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి, అమరాపురం గ్రామాల్లో వెలసిన శనీశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. సుప్రభాతసేవ, తైలాభిషేకం, పంచామృతాభిషేకం, నవగ్రహ పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చెత్త తొలగింపు పనులు చేయిస్తున్న కార్యదర్శి కెంచరాయప్ప

హిందూపురం అర్బన్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని తూమకుంట గ్రామ కార్యదర్శి కెంచరాయప్ప పేర్కొన్నారు. శనివారం సచివాలయ పరిధిలోని రహదారుల్లో చెత్త తరలింపు, రోడ్డుకు ఇరువైపుల పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో తొలగింపు పనులు చేయించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ రత్నమ్మ మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడ ప్రాంతం కావడంతో నిత్యం పరిశుభ్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొంత మంది పరిశ్రమల వారు పరిశ్రమల్లో వాడిన ప్యాకింగ్, ఇతరత్రా సామగ్రి రోడ్లపై వేయడంతో ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. తూమకుంట పంచాయతీని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

హిందూపురం: పట్టణంలోని రైల్వే రోడ్డు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. రైల్వే రోడ్డులో రూ.26 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను శనివారం పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయితే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చెట్లను తొలగించి రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్తు పోల్స్ మార్చాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రధాన రహదారి రైల్వే రోడ్డులో విద్యుత్తు లైన్లు మార్చడం వల్ల ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ వెంకటరమణ, ఏఈ జనార్దన్ కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

7వ వార్డులో పర్యటన

పట్టణంలోని 7వ వార్డు ముక్కిడిపేటలో శుక్రవారం రాత్రి విద్యుత్తు తీగలపై చెట్టు పడిపోవడంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వార్డు కౌన్సిలర్ నసిరాబాను ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే కూలిపోయిన చెట్టును తొలగించారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఎంఈ వెంకటరమణ, ఏఈ నాగేంద్ర, శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు షఫీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



రైల్వే రోడ్డులో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం

పరిగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 15న నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సరస్వతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కార్యాలయ సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాకర్ల సీజ్

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామంలో శుక్రవారం రాత్రి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే అధికారుల నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందడంతో మడకశిర సెబ్ సీఐ భార్గవరెడ్డి, మడకశిర ఎస్ఐ లోకేష్, రొళ్ల పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది నుంచి శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రొద్దం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. అనుమతి లేకుండా తరలించిన నాలుగు లోడుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.